ఆక్రమణలకు పాల్పడితే క్రిమినల్ కేసులు

- మేడ్చల్–మల్కాజిగిరి కలెక్టర్ గౌతం
- గుండ్లపోచంపల్లిలో మొక్కలు నాటిన జిల్లా పాలనాధికారి


మొక్కలు నాటుతున్న జిల్లా కలెక్టర్ గౌతం

మేడ్చల్ రూరల్: ఎఫ్‌టీఎల్, ప్రభుత్వ స్థలాలు ఆక్రమించినా, అవకతవకలకు పాల్పడినా సదరు వ్యక్తులపై క్రిమినల్ కేసులు పెట్టాలని, అయినా వినకుంటే పీడీ నమోదు చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ గౌతం ఆదేశించారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో మంగళవారం అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాటర్ ట్యాంకులను శుభ్రం చేసి క్లోరినేషన్ పరీక్షలు జరిపించాలని, ఇంటింటా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకునేలా చూడాలన్నారు. చెరువులను పరిశీలించి వాటి ఎఫ్‌టీఎల్ పరిధి నిర్ణయించడంలో సత్వర చర్యలు చేపట్టాలని, కబ్జాకు గురి కాకుండా నిరంతర పర్యవేక్షణకు గాను సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం ఎస్సీ కార్పొరేషన్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆవరణలో మొక్కలు నాటారు. యాదాద్రి ప్లాంటేషన్, ప్రకృతి వనం, పార్కులను సందర్శించారు. మొక్కల నాటే లక్ష్యాన్ని త్వరగా పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట ప్రత్యేకాధికారి వినోద్, మున్సిపల్ కమిషనర్ స్వామి, వైస్ చైర్మన్ ప్రభాకర్, అధికారులు దుర్గాప్రసాద్, శ్రీనివాస్‌గౌడ్, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.


వేడుకల్లో పాల్గొన్న చైర్మన్ కొండల్‌రెడ్డి

భక్తిశ్రద్ధలతో సీత్లా పండగ

పోచారం: అన్నోజిగూడలో బంజారాలు సీత్లా పండగ వేడుకలను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ముత్యాలమ్మ గుడిలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో చైర్మన్ కొండల్‌రెడ్డి, వైస్ చైర్మన్ రెడ్యానాయక్, కౌన్సిలర్లు మహేశ్, హరిప్రసాదరావు, సాయిరెడ్డి, రాజశేఖర్, నాయకులు రాజేశ్వర్‌రెడ్డి, మురళి, ప్రశాంత్, జితేందర్ నాయక్, సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయని వ్యక్తులపై కేసు

ఘట్‌కేసర్: ప్లాట్లు విక్రయించి తిరిగి ఖాళీ చేయాలని బెదిరింపులకు పాల్పడుతున్న వారిపై ఘట్‌కేసర్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎదులాబాద్‌కు చెందిన కటికం రాములు, కట్లం శ్రీశైలం గ్రామంలోని సర్వేనెంబర్ 10లో శ్రీరాంనగర్ కాలనీ పేరుతో 180 ప్లాట్లతో వెంచర్ ఏర్పాటు చేయగా చాల మంది పేదలు ప్లాట్లను కొనుగోలు చేశారు. అందులో పశువుల పాకలు నిర్మించుకుని ఉపాధి పొందుతున్నారు. అయితే అందులో కొందరికి మాత్రమే రిజిస్ట్రేషన్ చేశారు. మిగితా వారికి రిజిస్ట్రేషన్ చేయకుండా కటికం రాములు తన కుమారులు కటికం రాము, లక్ష్మణ్‌కు జీపీఏ చేశారు. అనంతరం కబ్జాలో ఉన్న వారిని ప్లాట్లు ఖాళీ చేయాలని బెదిరిస్తున్నారు. రిజిస్ట్రేషన్ చేయాలంటే రూ. 6 లక్షలు ఇవ్వాలని లేకుంటే ప్లాట్లు తిరిగి వారికే ఇవ్వాలని భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. దీంతో బాధితులు బస్వయ్య, నర్సింహ్మా, యాదయ్య పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కటికం రాములు, కటికం రాము, కటికం లక్ష్మణ్, కట్లం శ్రీశైలంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గ్రామాల్లో డీఎల్‌పీఓ పర్యటన

శామీర్‌పేట్: మూడుచింతలపల్లి మండలంలో మేడ్చల్ డీఎల్‌పీఓ సాంబిరెడ్డి మంగళవారం పర్యటించారు. మూడుచింతలపల్లి, కొల్తూర్, అనంతారం గ్రామాల్లో స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం గ్రామ పంచాయతీ రికార్డులు పరిశీలించారు. కొల్తూర్‌లో జరిగిన ప్రొఫెసర్ జయశంకర్ జయంతిలో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.


కొల్తూర్‌లో జయశంకర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీఎల్‌పీఓ సాంబిరెడ్డి

సుష్మాస్వరాజ్, గద్దర్‌కు ఘన నివాళి


ఘనాపూర్‌లో గద్దర్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

ఘట్‌కేసర్: తెలంగాణ చిన్నమ్మ సుష్మాస్వరాజ్, ప్రజా యుద్ధనౌక గద్దర్ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఘనాపూర్, కాచవానిసింగారంలో వారి చిత్రపటానికి పూలమాలల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ బీ బ్లాక్ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ రామారావుముదిరాజ్, మాజీ సర్పంచ్‌లు గోపాల్‌రెడ్డి, మమత, రూప్‌సింగ్, బాలశకురమ, బస్వరాజ్, సత్తయ్యగౌడ్, పరమేశ్‌గౌడ్ మల్లేశ్‌గౌడ్, శంకర్ ముదిరాజ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి


అన్నోజిగూడలో యాదాద్రి పార్కును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రాధికా గుప్తా

పోచారం: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా అన్నారు. యనంపేట్‌లోని ప్రాథమిక పాఠశాల, అన్నోజిగూడలోని జెడ్పీ హైస్కూల్, యాదాద్రి పార్కు, నారపల్లిలోని జంతు సంతాన నియంత్రణ కేంద్రాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారంలో మున్సిపల్ అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. ఆమె వెంట చైర్మన్ కొండల్‌రెడ్డి, కమిషనర్ వేమనరెడ్డి, హైస్కూల్ హెచ్‌ఎం స్వరూపారాణి, శానిటరీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా ఇంకుడు గుంత నిర్మించుకోవాలి


ఎస్‌ఎఫ్‌సీనగర్‌లో అవగాహన కల్పిస్తున్న చైర్ పర్సన్, కమిషనర్


నాగారం మున్సిపాలిటీలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: ఇంటింటా ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. 'స్వచ్ఛదనం–పచ్చదనం' కార్యక్రమంలో భాగంగా గోపికృష్ణకాలనీలో మంగళవారం కాలనీ వాసులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటికి ఇబ్బందుల్లేకుండా క్లోరినేషన్ చేసిన తర్వాతనే సరఫరా చేస్తున్నామన్నారు. అలాగే ఇంకుడు గుంతల నిర్మాణం ఎలా చేపట్టాలో మున్సిపల్ అధికారులు వివరించారు. అనంతరం దాయరకుంట చెరువును పరిశీలించి పచ్చదనంలో భాగంగా సమీపంలో మొక్కలు నాటారు. దమ్మాయిగూడ మున్సిపాలిటీలో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీతాగౌడ్, కమిషనర్ నాగమణి పాల్గొన్నారు. కీసర మండలంలోని యాద్గార్‌పల్లి, తిమ్మాయిపల్లి గ్రామాల్లో మండల ప్రత్యేకాధికారి పూర్ణిమ, ఎంపీడీఓ గ్యామ, ఎంపీఓ గ్యామ పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రౌండ్ వాటర్ ఆఫీసర్, (స్పెషల్ అధికారి) రేవతి, మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్, వైస్ చైర్మన్ బండారి మల్లేశ్ యాదవ్, కౌన్సిలర్లు పంగహరిబాబు, సుర్వీ శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌సీనగర్ సీ2లో..

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని ఎస్‌ఎఫ్‌సీనగర్ సీ2లో మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య, ప్రత్యేక అధికారి ప్రశాంత్, కమిషనర్ సాబేర్ అలీ బస్టాప్, చిన్న చెరువు వద్ద తాగు నీటి ట్యాంకులను శుభ్రం చేశారు. అలాగే బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినిలకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కౌన్సిలర్లు రమాదేవి, సంగీత, హెచ్‌ఎం పాపిరెడ్డి, నాయకులు సిరాజ్, మున్సిపల్ అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

అన్నోజిగూడలో..

పోచారం: అన్నోజిగూడలోని హనుమాన్‌నగర్‌లో వాటర్ ట్యాంకులు శుభ్రం చేశారు. అనంతరం మీరాలంకుంట వద్ద ఇన్ఫోసిస్ ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి పరిసరాల శుభ్రత, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. చైర్మన్ కొండల్‌రెడ్డి, కమిషనర్ వేమనరెడ్డి, మేనేజర్ అంజన్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇక శుభ్రంగా సర్కారు బడులు..!

- పారిశుద్ధ్యానికి ప్రత్యేక నిధులు
- ఆదేశాలు జారీ చేసిన విద్యాశాఖ అధికారులు
- మేడ్చల్ జిల్లాలో 507 ప్రభుత్వ పాఠశాలలు.. 96,284 మంది విద్యార్థులు
- జిల్లా మినరల్ ఫండ్ నుంచి నిధులు
- అమ్మ ఆదర్శ కమిటీ ఖాతాల్లోకి జమ
- విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా కేటాయింపు
- నెలకు రూ.3 వేల నుంచి రూ.20 వేల వరకు
- పంచాయతీ సిబ్బందికి కలగనున్న ఉపశమనం



సాక్షి,సిటీబ్యూరో: ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక నిధులు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించి విద్యాశాఖ జీవో21ను విడుదల చేయగా, అన్ని పాఠశాలలకు సర్క్యులర్ జారీ చేశారు. సమగ్ర శిక్షా అభియాన్ ద్వారా విడుదలయ్యే కాంపోజిట్ స్కూల్ గ్రాంట్‌కు అదనంగా ఈ నిధులు అందజేయనున్నారు. దీంతో పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందికి ఉపశమనం కలుగనున్నది. ఇప్పటివరకు సర్కారు బడుల్లో పారిశుద్ధ్య నిర్వహణ పనులను జిల్లా పంచాయతీ శాఖ, పురపాలికలు చూసుకుంటున్నాయి. ఇక మీదట ఆ వ్యవహారాలను అమ్మ ఆదర్శ కమిటీలు చూడనున్నాయి.

అమ్మ ఆదర్శ కమిటీ ఖాతాల్లోకి జమ..

ప్రభుత్వ పాఠశాలల పారిశుద్ధ్య నిర్వహణకు సంబంధించిన ప్రత్యేక నిధులు నేరుగా అమ్మ ఆదర్శ కమిటీ సభ్యుల ఖాతాలో జమకానున్నాయి. 3 నెలలకు సంబంధించిన నిధులను ముందే వారి ఖాతాల్లో జమ చేయాలని విద్యాశాఖ నిర్ణయించినట్లు తెలుస్తోంది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో మొత్తం 507 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా.. ఇందులో 96,284 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. జిల్లా మినరల్ ఫండ్ ట్రస్టు నుంచి ఈ నిధులను అందజేయాలని విద్యాశాఖ జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఇక నుంచి నిత్యం పాఠశాల పరిసరాలు అందంగా ఉంచడంతో పాటు మూత్రశాలలు, మరుగుదొడ్లను శుభ్రం చేయడం, మొక్కలకు నీళ్లు పట్టడం తదితర పనుల్ని నిర్వహించాల్సి ఉంటుంది. పాఠశాలల్లో శుభ్రత కోసం అవసరమైన వస్తువులను సమగ్ర శిక్ష నిధులను వెచ్చించాల్సి ఉంటోందని తెలుస్తోంది.

విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నిధుల కేటాయింపు

విద్యార్థుల సంఖ్య	నిధుల కేటాయింపు
1–30 మంది	రూ.3 వేలు
31–100 మంది	రూ .6వేలు
101– 250 మంది	రూ.8వేలు
251–500 మంది	రూ.12 వేలు
501 –700 మంది	రూ.15 వేలు
750 మందికిపైన	రూ.20 వేలు

బడుల్లో తొలగనున్న ఇబ్బందులు..

గత ప్రభుత్వం స్కావెంజర్లను తొలగించడంతో పాఠశాలల్లో పారిశుద్ధ్య నిర్వహణ సమస్య తెరపైకి వచ్చింది. ఈ నేపథ్యంలో ఆ పనుల బాధ్యతల్ని గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది చూసుకోవాలని ఆదేశించింది. ఈ నిర్ణయం మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా తయారైంది. అసలే పంచాయతీల్లో అరకొరగా ఉన్న పారిశుద్ధ్య సిబ్బందికే పాఠశాలల బాధ్యతల్ని అప్పగించడంతో పలు చోట్ల ఇబ్బందులు తలెత్తాయి. పంచాయతీల పాఠశాలల్లో పారిశుద్ధ్య నిర్వహణ బాధ్యతలను వదిలివేయగా, పంచాయతీ, విద్యాశాఖల మధ్య వివాదాలు కూడా తలెత్తిన సందర్భాలు ఉన్నాయి. దీంతో తరగతి గదులు, పరిసరాల శుభ్రత అంతంత మాత్రంగానే ఉండేది. వీటన్నింటినీ గుర్తించిన ప్రభుత్వం పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక నిధులు కేటాయించాలని నిర్ణయించింది. దీంతో పంచాయతీ సిబ్బందికి పని భారం తగ్గనుంది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ప్రతి నెల రూ.3 వేల నుంచి రూ.20 వేల వరకు ఇవ్వాలని నిర్ణయించడంతో పారిశుద్ధ్య పనులకు కూలీలు పోటీ పడే అవకాశం లేకపోలేదని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు. ఈ విషయమై తదుపరి చర్యలకు జిల్లా విద్యాశాఖ సమాయత్తమవుతోంది.

భాగస్వాములు కావాలి

శామీర్‌పేట్: స్వచ్ఛదనం–పచ్చదనంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని మూడుచింతలపల్లి మండల ప్రత్యేకాధికారి, జెడ్పీసీఈఓ నీరజ పిలుపునిచ్చారు. మూడుచింతలపల్లి మండలం, లక్ష్మాపూర్ గ్రామంలో మంగళవారం ఆమె పర్యటించి నీటి శుద్ధిపై పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వత్సలాదేవి, కార్యదర్శి శోభారాణి, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

బోర్ మోటార్ అపహరణ

శామీర్‌పేట్: బోర్ మోటార్, వైర్లు అపహరణకు గురైన ఘటన జినోమ్‌వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మూడుచింతలపల్లి మండలం కొల్తూర్ గ్రామానికి చెందిన దుర్గం నర్సింహులు తన పొలం వద్ద బోరుమోటార్ పాడవడంతో సోమవారం సాయంత్రం రిపేర్ చేయించి పొలం గట్టున పెట్టి ఇంటికి వెళ్లాడు. మంగళవారం ఉదయం పొలం వద్దకు వెళ్లి చూడగా కనిపించలేదు. అంతేగాకుండా విద్యుత్ వైర్ కూడా ఎత్తకెళ్లారు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ స్థలంలో సీసీ రోడ్డు నిర్మాణం

తొలగించేందుకు వెళ్లిన రెవెన్యూ అధికారులతో రియల్టర్ల వాగ్వాదం


రెవెన్యూ సిబ్బందితో వాగ్వాదం చేస్తున్న రియల్టర్లు

మేడ్చల్: ప్రభుత్వ స్థలంలో వేసిన సీసీ రోడ్డును తొలగించేందుకు వెళ్లిన రెవెన్యూ అధికారులను రియల్టర్లు అడ్డుకున్న ఘటన మేడ్చల్‌లో జరిగింది. మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని కిష్టాపూర్ రోడ్డులోని వాగు సమీపంలోని ఓ వెంచర్‌కు మేడ్చల్–కిష్టాపూర్ రోడ్డుకు ఆనుకుని ఉన్న సర్వే నెంబర్ 145లో గల ప్రభుత్వ స్థలాన్ని గతంలో కబ్జా చేసి నేరుగా అందులోకి వెళ్లేందుకు తాత్కాలిక మార్గం ఏర్పాటు చేశారు. అనంతరం సీసీ రోడ్డు పనులు చేపట్టడంతో స్థానికులు ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని కలెక్టరేట్ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన కలెక్టర్ విచారణకు ఆదేశించగా మంగళవారం స్థానిక రెవెన్యూ సిబ్బంది జేసీబీతో వెంచర్ వద్దకు వెళ్లారు. రోడ్డును తొలగించేందుకు యత్నిస్తుండగా సదరు వెంచర్ యజమానులు, మరికొంత మంది రియల్టర్లు అక్కడికి చేరుకుని అడ్డుకున్నారు. తాము ప్రభుత్వ స్థలం కబ్జా చేయలేదని, సర్వే చేసి రోడ్డు వేసినట్లు తేలితే తొలగించాలని నిలదీశారు. రోడ్డు కబ్జాకు గురైనట్లు ఆధారాలు ఉన్నాయని రెవెన్యూ సిబ్బంది తెలిపినా రియల్టర్లు అడ్డుకున్నారు. గతంలో వెంచర్ ఏర్పాటు సమయంలో రియల్టర్లు కొంతమంది అధికారులు, ప్రజాప్రతినిధులకు ముడుపులు ఇచ్చారని అందుకే తాత్కాలిక రోడ్డు ఏర్పాటు అయ్యిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ స్థలంలో రోడ్డు ఏర్పాటు చేసి ప్లాట్లు విక్రయించి అమాయకులను మోసం చేసిన రియల్టర్లపై చర్యలు తప్పవని తహసీల్దార్ శైలజ హెచ్చరించారు.

ఘనంగా జయశంకర్ జయంతి


జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్లు

సాక్షి,సిటీబ్యూరో: తెలంగాణ సిద్ధాంత కర్త, ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వివిధ శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్లు రాధికాగుప్తా (లోకల్ బాడీస్), విజయేందర్ రెడ్డి(రెవెన్యూ) మాట్లాడుతూ ఆచార్య జయశంకర్ తెలంగాణ రాష్ట్రం కోసం పలు పుస్తకాలు రచించారన్నారు. జయశంకర్ కలలు కన్న తెలంగాణను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేందుకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ జేఎల్‌బీ హరిప్రియ, కలెక్టరేట్ ఏఓ ఎల్. రామ్మోహన్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మేడ్చల్‌రూరల్/మేడ్చల్: మేడ్చల్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలతో పాటు మండలంలోని గ్రామాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ కార్యాలయాల్లో చైర్‌పర్సన్లు, కౌన్సిలర్లు, నాయకులు, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ, అధికారులు నివాళులర్పించారు. మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని కేఎల్‌ఆర్ చౌరస్తా వద్ద జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి, దీపికానర్సింహరెడ్డి, కమిషనర్లు నాగిరెడ్డి, స్వామి, కౌన్సిలర్లు, ఎంపీడీఓ వసంతలక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.

కీసర: నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీలతో పాటు మండలంలోని పలు గ్రామాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్లు కౌకుట్ల చంద్రారెడ్డి, ప్రణీతాగౌడ్, కమిషనర్లు రాజేంద్రకుమార్, నాగమణి, ఎంపీడీఓ గ్యామ , ఎంపీఓ నందకిశోర్, ఆయా గ్రామాల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఘనాపూర్, కాచవానిసింగారంలో..

ఘట్‌కేసర్: ఘనాపూర్, కాచవానిసింగారంలో జయశంకర్ చిత్రపటం, విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీఓ గీతారెడ్డి, కాంగ్రెస్ బీ బ్లాక్ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు గోపాల్‌రెడ్డి, మమత, రూప్‌సింగ్, సత్తయ్యగౌడ్, పరమేశ్‌గౌడ్, నర్సింహ, సురేశ్‌నాయక్, లతారెడ్డి, శివాజీ, మల్లేశ్‌గౌడ్, శంకర్ ముదిరాజ్, అజయ్‌యాదవ్, నరేశ్, శ్రీకాంత్, అశోక్, జగదీశ్ డ్వాక్రా మహిళలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.


ఎంపీడీఓ కార్యాలయంలో వేడుకల్లో అధికారులు, సిబ్బంది


మేడ్చల్ మున్సిపల్ కార్యాలయంలో పాలకవర్గం, కమిషనర్


ఘనపూర్ వేడుకల్లో మహేశ్‌గౌడ్, గోపాల్‌రెడ్డి


గుండ్లపోచంపల్లి మున్సిపల్ కార్యాలయం వద్ద..


మండల పరిషత్ కార్యాలయంలో ..


కేఎల్‌ఆర్ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు..

రంగనాయక స్వామి శేషవాహన సేవ

ఘట్‌కేసర్: ఎదులాబాద్ శ్రీ గోదాసమేత శ్రీ మన్నారు రంగనాయక స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం శేషవాహన సేవను ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి సుప్రభాతసేవ, నిత్యనిధి, హనుమంత సేవ చేపట్టారు. అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఊరేగించారు. స్వామి వారు, అమ్మవారికి దీపాలు, కొబ్బరికాయలతో భక్తులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

అంతర్గత డ్రైనేజీ పనులు ప్రారంభం

కీసర: నాగారం మున్సిపల్ పరిధిలోని మూడో వార్డు అయ్యప్పకాలనీ, రాఘవేంద్రకాలనీల్లో సుమారు 12 లక్షలతో చేపట్టిన అంతర్గత డ్రైనేజీ పనులను మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి వైస్ చైర్మన్ బండారి మల్లేశ్ యాదవ్‌తో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీలకతీతంగా కౌన్సిలర్లకు నిధులు కేటాయిస్తూఅభివృద్ధి పనులు చేపట్టి ఆదర్శ మున్సిపాలిటీగా నాగారాన్ని తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గోక కళావతియాదగిరి, కాలనీవాసులు పాల్గొన్నారు.

తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపిక



సాక్షి,సిటీబ్యూరో: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ, జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌లో నాలుగో తరగతి ప్రవేశాలకు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు వర్షిత, జస్వర్ధన్‌ను జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) రాధిక గుప్తా, జిల్లా యువజన, క్రీడల అధికారి అభినందించారు.

చిన్నారులకు పోషకాహారం అందించాలి

శామీర్‌పేట్: చిన్నారులకు పోషకాలతో కూడిన ఆహారాన్నే పెట్టాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రేణుక అన్నారు. ప్రపంచ తల్లి పాల వారోత్సవాల సందర్భంగా శామీర్‌పేట మండలం, తుర్కపల్లిలో మంగళవారం ర్యాలీ నిర్వహించి, తల్లులు, గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. కార్యదర్శి విజయ్‌కుమార్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ చతుర్వేద పారాయణం షురూ

కీసర: శృంగేరి జగద్గురువులు శ్రీ విదుశేఖర భారతీస్వామి జన్మదినోత్సవం సందర్భంగా బ్రహ్మణ నిత్యాన్నదాన సత్రం, ఇరగవరం వేదశాస్త్ర పరిషత్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో సంపూర్ణ చతుర్వేద పారాయణాన్ని మంగళవారం కీసరగుట్టలోని అన్నపూర్ణ సత్రంలో ప్రారంభించారు. ఈ నెల 12 వరకు జరగనున్న కార్యక్రమంలో పాల్గొనేందుకు తిరుపతి దేవస్థానం వేద పారాయణ పథక పర్యవేక్షకుడు బ్రహ్మశ్రీ గుళ్లపల్లి శివశర్మ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల వేద పండితులు వచ్చారు. ఆలయ పుర వీధుల్లో జగద్గురువుల చిత్రపటాలను ఊరేగింపుగా తీసుకెళ్లారు. చివరి రోజున వేద పండిత సన్మాన సభ చేపట్టనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సత్రం ఉపాధ్యక్షుడు పీఎస్. మూర్తి , కోశాధికారి హరి ప్రసాద్ సభ్యులు వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

అక్రమ కట్టడాల కూల్చివేత

ఘట్‌కేసర్: కాచివానిసింగారం గ్రామంలోని సర్వేనంబర్ 66లోని ప్రభుత్వ భూమిలో అక్రమ కట్టడాలను రెవెన్యూ అధికారులు జేసీబీతో మంగళవారం కూల్చివేయించారు. ఈ సందర్భంగా ఆర్‌ఐ సాయిరాం మాట్లాడుతూ తహసీల్దార్ రజనీ ఆదేశాల మేరకు కట్టడాలను కూల్చివేశామన్నారు. అక్రమంగా నిర్మాణాలు చేపడితే ఉపేక్షించే లేదని హెచ్చరించారు. జూనియర్ అసిస్టెంట్లు చందు ముదిరాజ్, శ్రీనివాస్‌రెడ్డి, విఠల్, ప్రవీణ్, రాజేశ్ పాల్గొన్నారు.

మీ అన్నయ్య లోన్ డబ్బులు కట్టండి

- తమ్ముడికి సైబర్ నేరస్తుల ఫోన్ కాల్స్
- స్నేహితులకు న్యూడ్ ఫొటోలు పంపిన వైనం
- పీఎస్‌లో ఫిర్యాదు చేసిన బాధితుడు

ఘట్‌కేసర్: మీ సోదరుడు తీసుకున్న లోన్‌యాప్ డబ్బులు చెల్లించాలని తమ్ముడికి ఫోన్ చేసి బెదిరిస్తున్న సైబర్ నేరస్తులపై ఘట్‌కేసర్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. మీ అన్న మా వద్ద యాప్ లోన్ తీసుకున్నాడు. డబ్బులు చెల్లించడం లేదు.. నీవే చెల్లించాలని మండలంలోని ఓ కళాశాలలో చదువువుతున్న తమ్ముడికి సైబర్ నేరస్తులు ఫోన్ చేశారు. లేకుంటే ఫేస్ మార్ఫింగ్ చేసిన ఫొటోలు బంధువులు, కాంటాక్ట్‌లో ఉన్న స్నేహితులకు పంపిస్తానని బెదిరించారు. లోన్ చెల్లించేది లేదు వారికి బదులిచ్చారు. దీంతో సైబర్ నేరస్తులు అతడి ఫొటోలో ఫేస్‌ను మార్ఫింగ్ చేసి అతడి కాంటాక్ట్‌లో ఉన్న అమ్మాయిలు, స్నేహితులకు న్యూడ్ ఫొటోలను సైబర్ నేరస్తులు పంపించారు. దీంతో విషయం తెలుసుకున్న ఆ విద్యార్థి పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

లారీ ఢీకొని యువకుడి మృతి

కీసర: ఆగి ఉన్న లారీని మరో లారీ ఢీకొట్టడంతో డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటన కీసరలో సోమవారం అర్ధరాత్రి జరిగింది. కీసర సీఐ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం.. కీసరకు చెందిన కండ్లకోయ పరమేశ్ కుమారుడు సైదులు ముదిరాజ్ (21) లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం రాత్రి లారీ తీసుకుని అంకిరెడ్డి పల్లికి వెళ్తుండగా కీసర సమీపంలోని పెద్దమ్మ చెరువు వద్ద జేసీబీ ఆగి ఉండడం గమనించాడు. దాని వెనకాల తన లారీ ఆపి దిగి జేసీబీ వద్దకు వెళ్లి డ్రైవర్‌తో మాట్లాడి తిరిగి వస్తుండగా అదే సమయంలో వెనకాల నుంచి వచ్చిన రెడీమిక్స్ లారీ వేగంగా వచ్చి తన లారీని ఢీకొట్టడంతో అది వచ్చి సైదులను తాకింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలు కాగా నగరంలోని గాంధీ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఈ మేరకు కీసర పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి ..

కీసర: ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందాడు. కీసర సీఐ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్‌నగర్ బాలాజీనగర్‌కు చెందిన రాజుగుప్తా (38) ప్రైవేట్ కంపెనీలో పని చేస్తూ సొంతంగా చిట్టీలు నడిపిస్తున్నాడు. అయితే చిట్టీ డబ్బులు తీసుకున్నవారు సరిగా చెల్లించకపోవడంతో ఇతరాత్ర చోట్ల డబ్బులు తెచ్చి చిట్టీలు నడిపాడు. అప్పులు ఎక్కువై ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. ఇంట్లో డబ్బుల కోసం గొడవలు జరుగుతున్నాయి. దీంతో మనస్తాపానికి గురైన అతను సోమవారం కీసర మండలం యాద్గార్‌పల్లి సమీపంలో ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. స్థానికులు గమనించి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు రాజుగుప్తాను నగరంలోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి మంగళవారం తెల్లవారుఝాము మున మృతి చెందాడు. రాజుగుప్తాకు భార్య , ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కీసర పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.